క్లుప్తంగా

జియో ట్యాగింగ్‌కు సహకరించాలి
ఎంపీడీఓ సునీతశర్మ



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో జరుగుతున్న జియో ట్యాగింగ్ మ్యాపింగ్‌కు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీఓ సునీత శర్మ కోరారు. కేతనకొండ గ్రామంలో ఇంటింటికీ జరుగుతున్న జియో ట్యాగింగ్ సర్వేను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జియో ట్యాగింగ్ చేసిన ఇళ్లకు జియో కో–ఆర్డినేట్స్ క్యాప్చర్ చేయనున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్ పూర్తయితేనే ఏ పథకమైనా ఇంటి పరిధిలో లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. సచివాలయం పరిధిలో మ్యాపింగ్ చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.నళిని ఆశాలత, పంచాయతీ కార్యదర్శి ఎం.మోనిక, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ




మైలవరం: యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రథమ మహాసభ కరపత్రాలను మైలవరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. మైలవరం మండల శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎం. తిరుపతి రావు, వాడపల్లి వసంతరావు మాట్లాడుతూ మహాసభ ఆదివారం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యదర్శి కె. గంగరాజు, వెల్వడం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి. సాయికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ తరగతులు



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రియ విద్యాలయంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో విద్యా బోధన చేస్తున్నామని కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ తెలిపారు. గుంటుపల్లి కేంద్రియ విద్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పలు అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయినిగా సీహెచ్ సుజాతను నియమించి స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, సిట్టింగ్ రోల్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. సాధారణ విద్యార్థులతో పాటు తరగతి గదిలో కూర్చోబెట్టి సమ్మిళిత విద్య అందిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, పద్మజ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నూజివీడు: మండలంలోని మొర్సపూడి సొసైటీ పరిధిలో ఇటీవల మృతిచెందిన ఇద్దరు సభ్యులకు సంబంధించి మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. సొసైటీ సభ్యులైన మరీదు బసవయ్య, పరికల వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె.బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. సొసైటీ సీఈఓ నీలం శ్రీనివాసరావు, సిబ్బంది సింహాద్రి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



మైలవరం: శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి (అమ్మ భగవాన్ సేవా సమితి) ఆధ్వర్యంలో నిరుపేదలు, పంచాయతీ కార్మికులకు దుప్పట్లు, టవల్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సమితి సభ్యులు మాట్లాడుతూ శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి అధ్వర్యంలో కృతజ్ఞతా భావం దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా దుప్పట్లు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. పరంజ్యోతి భగవతి భగవాన్ బోధనలు ఆచరించే ప్రతి ఒక్కరూ ప్రపంచ వ్యాప్తంగా కృతజ్ఞతా దినోత్సవం ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



నూజివీడు- సుంకొల్లు రోడ్డులో కోతకు గురైన మార్జిన్

ప్రయాణం.. ప్రమాదం

తరచూ ప్రమాదాలు
పట్టించుకోని పాలకులు
మరమ్మతులైనా చేయించాలని వినతి

నూజివీడు: నూజివీడు ప్రాంతంలో రహదారుల మార్జిన్లు ప్రమాదకరంగా మారాయి. ఈ ఏడాది ఆగస్టు 31న వచ్చిన వరదలకు నూజివీడు పట్టణంతో పాటు మండలంలోని పలు రహదారుల మార్జిన్లు కోతకు గురయ్యాయి. నిత్యం వాహనాల రాకపోకలు సాగించే రోడ్ల మార్జిన్లకు మరమ్మతులు చేయించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలోనో, ఎదురుగా వెళ్లే వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలోనో రోడ్డు మార్జిన్లలోకి వెళ్లిన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వాహన చోదకుల ఆందోళన

ముఖ్యంగా నూజివీడు పట్టణం మీదుగా వెళ్లే 216 ఎన్‌హెచ్ జాతీయ రహదారి(మచిలీపట్నం–నూజివీడు–కల్లూరు జాతీయ రహదారి) వెంబడి మార్జిన్లు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నూజివీడు నుంచి సుంకొల్లు వెళ్లే రహదారిపై ఈదుల చెరువు వద్ద మార్జిన్ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఏమాత్రం ఆదమరిచి ఉన్నా చెరువులోకి పడిపోవాల్సిందేనని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రోడ్లదీ అదే తీరు

నూజివీడు నుంచి బోర్వంచ వెళ్లే రోడ్డులో పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్ సమీపంలో మలుపు వద్ద పెద్ద అగాధం ఏర్పడింది. ఇక్కడ ఏదైనా భారీ వాహనం ఎదురైతే వాహనాలు ఈ అగాధంలో పడిపోవడం ఖాయం. ఈ రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, మామిడి పరిశోధన స్థానం వద్ద రహదారి మార్జిన్లు కోతకు గురయ్యాయి. మార్జిన్లు ధ్వంసమై మూడు నెలలు కావస్తున్నా ఎందుకు మరమ్మతులు చేయించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అయినప్పటికీ రోడ్ల మార్జిన్‌లను గాలికి వదిలేయడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే మార్జిన్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కోతకు గురైన రోడ్డు మార్జిన్



నూజివీడు-బోర్వంచ రోడ్డు మలుపులో ఏర్పడిన భారీ గుంత



నూజివీడులోని మామిడి పరిశోధన స్థానం వద్ద కోతకు గురైన రోడ్డు మార్జిన్

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు
తహసీల్దార్ రాజకుమారి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

గంపలగూడెం: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ రాజకుమారి అన్నారు. గంపలగూడెం మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర పొందాలన్నారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కొనుగోళ్లను ముమ్మరంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సాయిశ్రీ, వీఆర్‌ఓ సీతామహాలక్ష్మి, వీఏఏ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎనిమిది గ్రామాల్లో గ్రామ సభలు

గంపలగూడెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను ఎంపిక చేసేందుకు మండలంలోని ఎనిమిది గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ చెన్నయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆర్లపాడు, గాదెవారిగూడెం, గోసవీడు, గుళ్లపూడి, పెనుగొలను, పెదకొమిర, సత్యాలపాడు, తునికిపాడు గ్రామాల్లో గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయన్నారు. రైతులు, గ్రామస్తులు ఆయా గ్రామ సభల్లో పాల్గొని గ్రామాల్లో అవసరమున్న పనులను గ్రామ సభల దృష్టికి తీసుకురావాలన్నారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు శిబిరాలు



ఓటు నమోదుపై మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

విస్సన్నపేట: ప్రతి గ్రామంలో ఓటరు నమోదు శిబిరాలను శని, ఆదివారాల్లో నిర్వహిస్తామని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి అన్నారు. స్థానిక వికాస్ పీజీ కళాశాలలో ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటర్ కార్డు కోసం ఫారమ్ 6 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు కార్డు ఉండి దానిలో తప్పులు సవరణకు ఫారమ్ 8 ద్వారా సవరణ చేసుకోవాలని చెప్పారు. ప్రతి గ్రామంలో పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ విజయ భాస్కర్, ఆర్ఐ సుజాత, కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

- గంపలగూడెం: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం మండలంలో శని, ఆదివారాల్లో నిర్వహిస్తామని తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. అర్హులైన నూతన ఓటర్లు ఫామ్ 6, సవరణకు ఫామ్ 7, 8లలో దరఖాస్తులను పూర్తి చేసి అందజేయాలన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన సరిహద్దు వివాదం



భూమి పత్రాలు పరిశీలిస్తున్న ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి, సీఐ చంద్రశేఖర్

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): మండలంలోని తుమ్మలపాలెం గ్రామంలో స్థలాల మధ్య సరిహద్దు వివాదం శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఓ స్థలానికి సంబంధించిన యజమాని భూమి చదును చేసి సరిహద్దు రాళ్లు వేసుకుంటున్న క్రమంలో పక్క స్థలానికి చెందిన మరో వ్యక్తి తన స్థలం సరిహద్దు దాటి లోపల రాళ్లు పాతవద్దని అడ్డుకున్నాడు. ఈ విషయంలో కూటమి నాయకులు జోక్యం చేసుకోవడంతో వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. స్థలం వద్దకు చేరిన సీఐ చంద్రశేఖర్ ఇరువురి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. విషయాన్ని ఏసీపీ మురళీ కృష్ణారెడ్డికి చేరవేయడంతో ఆయన స్థలం వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. తహసీల్దార్ రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయించుకుని సరిహద్దు రాళ్లు పాతుకోవాలని ఏసీపీ స్థల యజమానులకు సూచించారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పనులు నిలిపి వేశారు.

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామసత్యనారాయణ



మాట్లాడుతున్న రామ సత్యనారాయణ

నెమలి(గంపలగూడెం): సమస్యల పరిష్కారానికి, సంఘ పటిష్టతకు ఆర్యవైశ్యులు సంఘటితం కావాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ అన్నారు. నెమలిలో శుక్రవారం జిల్లా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా రాజకీయాలపై దృష్టి సారించాలన్నారు. రాజకీయాల్లో తగిన స్థానం సాధిస్తేనే సమస్యలు పరిష్కారం అవడంతో పాటు ఆర్యవైశ్యుల అభివృద్ధి జరుగుతుందన్నారు. తొలుత సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు నిండిన 30 మంది ఆర్య వైశ్య దంపతులకు సన్మానించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రయదారుల అరెస్టు

మైలవరం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 250 గ్రాముల గంజాయి, ఒక స్కూటీ, ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మైలవరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ విజయవాడ సత్యనారాయణపురం తాడంకివారి వీధికి చెందిన దినవహి కృష్ణవంశీ, ఏలూరు జిల్లా నూజివీడు పాతపేటకు చెందిన పఠాన్ అస్లాం ఖాన్ గంజాయికి, దుర్వ్యసనాలకు బానిసలయ్యారని చెప్పారు. వీరు దొంగ తనాలు చేస్తూ ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి మైలవరం పరిసర ప్రాంతాలకు తీసుకువచ్చి అధిక ధరకు విక్రయిస్తుంటారన్నారు. వీరు మరి కొంతమందితో కలిసి ఎన్టీఆర్ జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలు చేస్తూ ఆ విధంగా దొంగిలించిన వస్తువులను ఏజెన్సీ ప్రాంతాలకు తీసుకువెళ్లి గంజాయిని తీసుకుని దొంగిలించిన వస్తువులను వారికి ఇచ్చేవారని చెప్పారు. ఆ విధంగా గంజాయిని తీసుకువచ్చి చిన్నచిన్న పొట్లాలుగా కట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో కిలో గంజాయి రూ.4 వేలకు కొనుగోలు చేసి దానిని దూర ప్రాంతాలకు తీసుకు వెళ్లి రూ.20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయించుకుంటున్నారని విచారణలో తేలిందన్నారు. మైలవరం ఏసీపీ వై. ప్రసాదరావు నేతృత్వంలో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, మైలవరం ఎస్ఐ కె. సుధాకర్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా నిందితులు మైలవరం మండలం వెల్వడం గ్రామ శివారులోని కోతుల వాగు తూర్పు వంతెన వద్ద గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారని చెప్పారు.

చాట్రాయిలో చిన వెంకన్న రథయాత్ర



చాట్రాయి: ద్వారకా తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి రథయాత్ర మండలంలోని చాట్రాయిలో శుక్రవారం జరిగింది. ఈ రథయాత్రలో భక్తులు స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట వెళ్తుండగా చాట్రాయిలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఆందోళన
అక్రమాలపై పోరాడతామని జనసేన నేత హెచ్చరిక



గోపాలపురం మట్టి క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు

తిరువూరు: ఎ కొండూరు మండలం గోపాలపురంలో పెద్దఎత్తున జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గోపాలపురం మట్టి క్వారీ వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గోపాలపురం సమీపంలో మట్టి క్వారీలలో యథేచ్ఛగా గత మూడు నెలలుగా తవ్వకాలు జరుపుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మట్టి క్వారీయింగ్‌పై పత్రికల్లో గతంలో కథనాలు వచ్చినా నిలుపుదల చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. తాము నియోజకవర్గంలో కూటమి నాయకులు చేసే అక్రమాలకు వత్తాసు పలకబోమని, వీటిపై పోరాడతామని హెచ్చరించారు. చిన్నరైతులు, పేదలు ఒక ట్రక్ మట్టి తీసుకెళితే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకునే అధికారులు పెద్దఎత్తున గోపాలపురంలో జరిగే అక్రమ తవ్వకాలపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. తిరువూరు ఆర్డీఓ, ఎ. కొండూరు తహసీల్దార్ తమకు సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నందున తమ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని కోరనున్నామని చెప్పారు.

సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలి
తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ

తిరువూరు: ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాల బారిన ప్రజలు పడకుండా బ్యాంకర్లు సహకరించాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. తిరువూరులోని పలు బ్యాంకులలో సిబ్బందికి, అధికారులకు డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలకు ఎవరైనా అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు లావాదేవీల గురించి ఆరా తీసినా, డెబిట్, క్రెడిట్ కార్డులు ఓటీపీ చెప్పమని అడిగినా స్పందించవద్దని ఖాతాదారులకు బ్యాంకర్లు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో మహిళా సంరక్షణ కార్యదర్శులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

నగర పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి
ఆర్‌జేడీకి కౌన్సిలర్ల వినతి



తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ జి. కస్తూరి బాయి, కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తిరువూరు వచ్చిన మున్సిపల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నరసింహారావుకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక సమస్యలను వారు వివరించారు. తిరువూరులో పెరిగిన జనాభా దృష్ట్యా అదనపు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని, కృష్ణా నది ఫెర్రి నుంచి తిరువూరు పట్టణానికి తాగునీరు పైలెట్ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తిచేయాలని, తిరువూరు నగర పంచాయతీలో ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు. పట్టణ పరిధిలో దేవాలయ భూములను 22ఎ చట్టం కింద నిషేధిత జాబితాలో చేర్చినందున గృహ నిర్మాణానికి అనుమతి ఇవ్వలేక పోతున్నామని, ఈ కారణంగా మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు
ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్



నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికులు తమ హక్కులను కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. పట్టణంలోని అమర్ భవన్‌లో శుక్రవారం ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ సమావేశం అధ్యక్షుడు అక్కినేని ఆంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గం విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుందని, నాలుగు లేబర్ కోడ్లతో కార్మికవర్గం నడ్డి విరిచే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ధ్వజమెత్తారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 14 నెలల పాటు స్ఫూర్తిదాయకమైన ఉద్యమాన్ని చేపట్టడంతో తలొగ్గిన ప్రధాని నరేంద్ర మోదీ మూడు చట్టాలను రద్దు చేస్తామని చెప్పి రైతులకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని విమర్శించారు. వీటితో పాటు పలు సమస్యల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీన దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కార్యాలయాల వద్ద రైతు, కార్మికవర్గం ఆందోళనకు సిద్ధమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో జాబ్ కార్డుల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుల పరిశీలనకు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. పది గ్రామాల పరిధిలో 6,489 మంది జాబ్ కార్డులను పరిశీలించి పునరుద్ధరించారు. గ్రామాంతరం వెళ్లిన వారి జాబ్ కార్డులను రద్దు చేసి అతనికి, అతని భార్యకు ఒకే జాబ్‌కార్డు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లో 142 పనులను గుర్తించి అంచనాలు తయారు చేయాల్సిందిగా సాంకేతిక సిబ్బందిని ఆదేశించారు. కొటికలపూడిలో సర్పంచి రెంటపల్లి నాగరాజు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎంపీడీఓ సునీతశర్మ పాల్గొని ఉపాధి హామీ పథకంలో పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. ఏపీఓ ప్రమీల, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.